సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు

జోరుగా ఇసుక మాఫియా

- రోజుకు రూ.లక్షల్లో వ్యాపారం
- మామూళ్ల మత్తులో అధికారులు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలో ఇసుక అక్రమంగా జోరుగా సాగుతోంది. రోజుకు రూ.లక్షల్లో ఆదాయం వస్తుండడంతో అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు ఇసుకను తరలిస్తున్నారు. అధికారులకు మామూళ్లు ముట్టజెబుతుండడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కర్ణాటక సరిహద్దు మండలమైన హాలహర్విలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోంది. మండలంలో హగరి వాగు ప్రవహిస్తుండడంతో ఇసుక అక్రమ రవాణా కాసుల పంట పండిస్తోంది. స్థానికంగా ఉన్న ఇసుకను కొందరు ఆదోని డివిజన్ పరిసర ప్రాంతాలతో పాటు కర్ణాటకకు రోజుకు వందలాది వాహనాల్లో తరలిస్తూ లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో తూగుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇసుక బూచీని చూపుతూ ఒక ట్రాక్టర్ రూ.5 వేలకు పైగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.

జోరుగా ఇసుక మాఫియా

కొంత మంది అక్రమార్జనకు అలవాటు పడి రాత్రి, పగలు అనే

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని జె.హోసళ్లి, గూళ్యం ప్రాంతాల్లో ఇసుక గ్రామానికి దగ్గరగా ఉండడంతో అక్రమార్కులకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నది నుంచి తరలిస్తున్నారు. కొంతమంది ఇసుక ట్రాక్టర్ యజమానులు ఒక గ్రూపుగా ఏర్పడి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

చూసీచూడనట్లు వదిలేస్తున్న అధికారులు

మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తహశీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదులు వచ్చినా స్పందించడం లేదు. వారు సకాలంలో స్పందించడం లేదని ఫిర్యాదు చేసిన కొందరు వాపోతున్నారు.

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం..

- సిపిఎం మండల కార్యదర్శి కృష్ణమూర్తి

ఇసుకను అక్రమంగా తరలించే ట్రాక్టర్ల యజమానులపై ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో ఉన్న జె.హోసళ్లి గ్రామంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మండల అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

రెండు అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు పట్టివేత

సి బెళగల్ : మండలంలోని ఏటిగడ్డకు ఎస్ఐ మన్మధ విజయ్ పోలీస్ సిబ్బందితో వెళ్లి శనివారం ఇసుక అక్రమ రవాణాపై దాడులు చేశారు. ఇందులో సోమలగూడూరుకు చెందిన మండ్ల బాలమునికి గల మహీంద్రా ట్రాక్టర్, పొనకళ్లకు చెందిన కురువ నరసింహులుకు గల సోనాలిక ట్రాక్టర్ అక్రమంగా ఇసుక లోడుతో వెళ్తుంటే పట్టుకున్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎఐకెఎస్ ప్రదర్శనను జయప్రదం చేయండి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలులో ఈనెల 15న నిర్వహించే ఎఐకెఎస్ భారీ ప్రదర్శనను, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. శనివారం కర్నూలు సూర్యనారాయణ భవన్‌లో మట్టిపని కార్మికుల జనరల్ బాడీ సమావేశం సిఐటియు నగర నాయకులు జి.ఏసు అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మికులు, కర్షకులు, రైతులు, రైతు కూలీల హక్కులను హరించడమే పనిగా పెట్టుకుందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టాలను చేస్తూ ప్రజల పైన విపరీతమైన భారాలు వేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని పేర్కొన్నారు. రైతాంగ సుదీర్ఘ పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలను చేసి మొక్కవోని పట్టుదలతో నరేంద్ర మోడీ మెడలు వంచి రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసే విధంగా పోరాటం చేసిన మహా పోరాట యోధులు మన కర్నూలుకు రాబోతున్నారన్నారు. మరో రైతుపోరాటానికి రూపకల్పనచేయడానికి మన కర్నూలు నగరంలో అఖిల భారత రైతు కౌన్సిల్ సమావేశాలు, భారీ ప్రదర్శన బహిరంగసభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ సభలను విజయవంతం చేయడం కోసం కార్మిక వర్గం ముందు నిలబడి భారీ ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. జనరల్ బాడీ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు రామాంజనేయులు, వెంకటరాముడు మల్లకల్లు, దాసు, ఈశ్వరమ్మ, శేషమ్మ, శాంతమ్మ, సరోజమ్మ, మరియమ్మ, రమాదేవి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నోపా భవన ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

నాయి బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ కర్నూలు ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనం ప్రారంభోత్సవం , నాయి బ్రాహ్మణ వనభోజన కార్యక్రమం కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ సమీపంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోపా అధ్యక్షుడు డాక్టర్ నవీన్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బివై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ , ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, డిఎస్‌పి మహబూబ్ బాషా, సిఐ ఉపేంద్ర బాబు, జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు జమ్ముల జనార్ధన్ హాజరయ్యారు. బీవై రామయ్య మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సోదరులు వనభోజన కార్యక్రమం జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. ముఖ్యంగా నాయి బ్రాహ్మణ సోదరులు నిర్మించిన విద్యార్థి వసతిగృహం ఎంతో బాగుందన్నారు. వారు విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమన్నారు. హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ విద్యకు ఎంతో ప్రాధాన్యత నిచ్చి పేద విద్యార్థులకు జిల్లా కేంద్రంలో ఒక షెల్టర్ ఉండాలనే ఉద్దేశంతో కీర్తిశేషులు సివి నర్సయ్య ధృడ సంకల్పంతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. ఆయన మరణానంతరం ఆ బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకొని ఆయన తనయుడు డాక్టర్ నవీన్ కుమార్ ఎంతో శ్రమించి ఈ భవన నిర్మాణం పూర్తి చేశారన్నారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా ఇలా కులమంతా ఒక చోట చేరి ఒక కుటుంబంలో వనభోజనాల కార్యక్రమం జరుపుకోవడం ఎంతో సంతోషదాయకమన్నారు. టిటిడి ట్రస్ట్ బోర్డ్ మెంబర్ సిద్ధవటం యానాదయ్య మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు ఎంతో ప్రాధాన్యతనిచ్చిందన్నారు. బుట్టా రేణుక ,జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు జమ్ముల జనార్ధన్, నోపా అధ్యక్షుడు డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడారు. నోపా ఉపాధ్యక్షుడు ధన విజయుడు, జనరల్ సెక్రెటరీ పోలీసు వెంకట స్వామి, నోప కోశాధికారి అనుకొండ మద్దిలేటి , రామాంజనేయులు మల్లికార్జున వెంకటేష్, పసుపులమధు, లక్ష్మీపురం రాఘవేంద్ర దేవనకొండ పుల్లయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

బతుకులు దయనీయం...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. నిర్మాణ రంగంలో దాదాపు 36 రకాల పనులు చేసేవారున్నారు. బోర్లు తీసేవారు, రాడ్ బెండింగ్, తాపీ పని, సెంట్రింగ్, ప్లంబింగ్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్లు, మార్బుల్స్ అతికేవారు, ఇటుక బట్టీల్లో పని చేసేవారు, కాంక్రీట్ మిల్లర్లు, భవన నిర్మాణ కార్మికులు ఇలా వీరందరూ నిర్మాణ రంగంపై ఆధారపడి బతుకుతున్నారు. వీరంతా రోజువారీ పనులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తుంటారు. తాపీ మేస్త్రీకి రూ.900 నుంచి రూ.వెయ్యి, పని చేసే కార్మికులకు రూ.500 నుంచి రూ.600 వరకూ కూలి ఉంటుంది. నెలంతా పని చేస్తేనే వీరికి ఇల్లు గడుస్తోంది. ఇసుక సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడంతో గడిచిన మూడు నెలలుగా నిర్మాణ రంగం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పనుల్లేక కార్మికులు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. ఆదాయం లేకపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబాలు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు కొనసాగుతున్నా ధరలు చూస్తే గుండె గుబేలుమంటోంది. మూడు నెలల క్రితం వరకూ పది చక్రాల లారీ ఇసుక రూ.18 వేల నుంచి రూ.20 వేలు వరకూ ఉండేది. ఇప్పుడు రూ.30 వేల నుంచి రూ.32 వేల వరకూ ధర పలుకుతోంది. మొన్నటి వరకూ టన్ను ఇసుక రూ.వెయ్యి ఉండగా ప్రస్తుతం రూ.1500 వరకూ పలుకుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.1200 ఉండేది కాస్తా రూ.ఐదు వేలకు చేరింది. బ్లాక్‌మార్కెట్లో ఇసుక కొనుగోలు చేయాలంటే చుక్కలు కన్పిస్తున్నాయి. నిర్మాణ రంగం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వైసిపి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఉచిత ఇసుక పాలసీని రద్దు చేసి కొత్త పాలసీ ప్రకటించడంలోనూ జాప్యం చేయడంతో భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులు నెలల తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దఎత్తున ఉపాధి పొందే రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిల్లలకు ఫీజులు కట్టలేక, ఇల్లు గడవక అప్పులు తెచ్చి కార్మికుల కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ఇసుక సరఫరాను వేగవంతం చేసి నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులను ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

పశుసంవర్ధక శాఖ ఉద్యోగాల భర్తీలో నకిలీ సర్టిఫికెట్ల దందాను అరికట్టాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ధర్నా నిర్వహించారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యంలో ఆవేదన దీక్ష లో భాగంగా నిరసన తెలిపారు. తుగ్గలిని కరువు మండలంగా తక్షణమే ప్రకటించాలని సిపిఐ, సిపిఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఎంపిపి కార్యాలయంలోకి దూసుకెల్లడంతో పోలీసులు అడ్డగించారు. దీంతో రైతులు, రైతు సంఘం నాయకులు ఎంపిపి కార్యాలయంలోకి దూసుకెళ్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. సర్వసభ్య సమావేశంలో సభ్యులంతా కలిసి తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని తీర్మానం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఘంటసాల జయంతి వేడుకలు నిర్వహించారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఎస్సీ మహిళలకు సెర్ప్ - ఉన్నతి మహిళా శక్తి పథకం కింద ఆటో రిక్షాలను పంపిణీ చేశారు.

పదో తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించిన పదవ తరగతి మోడల్ పేపర్లను శనివారం పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామెల్ పాల్ ఆవిష్కరించారు. రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ జిల్లా అధ్యక్షులు, రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షులు హేమంత్, జిల్లా కోశాధికారి యోహోసువ జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, దుర్గప్రసాద్ వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.సురేష్ కుమార్ , రవికుమార్ నవీన్ పాటి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల శ్రేయస్సును కూడా దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏడాది మోడల్ పేపర్ల ప్రచురణ నిర్వహిస్తున్నదన్నారు. మోడల్ పేపర్ల రూపకల్పనలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రూపొందించబడి అతి తక్కువ ధరకు తెలుగు , ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు రూ.75 అన్ని సబ్జెక్టులు ఉండే విధంగా తయారుచేసి అందిస్తున్నామన్నారు. గత సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లలోని ప్రశ్నలు 80శాతం పైగా వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎంతో చక్కగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు అయ్యారన్నారు. ఈ ఏడాది కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించుటకు ఈ మోడల్ పేపర్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు పేర్కొన్నారు.

పేపర్లను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ ఎడి, యుటిఎఫ్ నాయకులు

డిసిసి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బాబురావు, మారెప్ప, తదితరులు

ఘనంగా సోనియా గాంధీ పుట్టినరోజు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను శనివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబురావు పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నతమైన ప్రధాని పదవిని త్యాగం చేసిన మహిళ సోనియా గాంధీ అని కొనియాడారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో ఏవిధంగా ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. అదేవిధంగా రాష్ట్రంలో కూడా కట్టబట్టే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్, పిసిసి అధికార ప్రతినిధి ఎ. కరుణాకర్ బాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, రాష్ట్ర సేవాదళ్ మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్.ప్రమీల, సేవాదళ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎ. వెంకట సుజాత, సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖాజా హుస్సేన్ లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ఆధ్వర్యంలో పెండింగు బకాయిల వసూలు చేస్తున్న దృశ్యం

భవన నిర్మాణ అనుమతుల ఫీజు బకాయిల వసూలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా అధికారులు శనివారం ప్రజల నుండి భవన అనుమతి ఫీజు బకాయిలను లోక్ అదాలత్ కర్నూలు ద్వారా వసూలు చేశారు. పెండింగు బకాయిలను వసూలు చేశారు. డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్ , అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రంగస్వామి , శశిలత , బిల్డింగ్ పర్యవేక్షకులు మంజులమ్మ , శబరీష్, మస్రత్ అలీ ఖాన్, టౌన్ ప్లానింగ్ సీనియర్ అసిస్టెంట్ సుబ్బన్న , జూనియర్ అసిస్టెంట్లు భార్గవ్ , నరసింహులు, ఖాసిం , వార్డు ప్లానింగు కార్యదర్శులు ఇతర సిబ్బంది హాజరు అయ్యారు.

జర్నలిస్టులు ప్రమాద బీమా సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : సమాజం అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ఉందని, రోడ్డు, నీటి ప్రమాదంలోమృతి చెందిన వారికి బీమా వర్తిస్తుందని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ సీనియర్ వైద్యులు శంకర్ శర్మ తెలిపారు. శనివారం కర్నూలు నగరం గాయత్రి ఎస్టేట్‌లోని సద్గురు దత్తపాలి క్లినిక్‌లో ప్రమాద బీమాపై అవగాహన కల్పిస్తూ జర్నలిస్టుల పాలసీలను రూ.5 లక్షల ప్రమాద బీమా పాలసీకి అయ్యే ఖర్చును ఆయన ఇన్సూరెన్స్ అధికారులకు అందజేశారు. సీనియర్ వైద్యులు శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రమాద బీమా పాలసీ చేయించుకున్న వారు భారతదేశంలో పాటు ఇతర ఏ దేశాలలోనైనా ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబానికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ అధికారులు అందజేస్తామన్నారు. రోడ్డు ప్రమాదంలోనైనా నీటి ప్రమాదంలోనైనా మృతి చెందితే వర్తిస్తుందన్నారు. ప్రమాద బీమా పాలసీ నామినీగా కూతురు కొడుకు, భార్య ఎవరినో ఒకరిని పెట్టుకోవచ్చని అన్నారు.

జర్నలిస్టులకు బీమా పత్రాలను అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారధిగా ఉంటూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ అభివృద్ధిలో పాలు పంచుకుంటారన్నారు. రాత్రి పగలు లేకుండా అనేకమంది జర్నలిస్టులు తమ విధినిర్వాణ చేస్తూ తిండికి నిద్రాహారాలకు దూరమయ్యే సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. సమయపాలన లేకుండా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ప్రమాద బీమా పాలసీలు చేయించడం మంచిదేనన్నారు. చాలామంది హెల్త్ ఇన్సూరెన్స్ పై అవగాహన లేక వాటిని తీసుకోవడం లేదని, హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కార్పొరేట్ హాస్పిటల్లో కూడా వైద్యం పొందవచ్చని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఐపిపిబి మేనేజర్ మహమ్మద్ అజీజ్, మెయిల్ ఓవర్ సర్ చిన్న రాజు, పోస్ట్‌మాస్టర్ అజయ్ కుమార్, జర్నలిస్టులు శ్రీనివాస్, మల్లికార్జున, రామస్వామి, ప్రసాద్ రెడ్డి, నజీర్, విజయ్, దినేష్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ పాలకమండలి 'కార్తీక' సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ ఆధ్వర్యంలో శనివారం గార్గేయపురం చెరువు వద్ద గల నగరవణంలో కార్తీక వనభోజనాల ఘనంగా నిర్వహించారు. కమిషనర్ ఎ. భార్గవ్ తేజ, మేయర్ రామయ్య గార్గేయపురం చెరువు వద్ద గల నగర వనంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుమారి పల్లవి తాండవ నృత్యం, చిన్నపిల్లల నృత్యాలు, ఆటపాటలతో అధికారులు పాలకమండలి కార్పొరేటర్లు సంబరాలు చేసుకున్నారు. భోజనాల అనంతరం అందరూ కలిసి మ్యూజికల్ చైర్స్ ఆడారు. అందులో మేయర్, మహిళా కార్పొరేటర్ గెలిచారు. అనంతరం మ్యూజిక్ బాల్ ఆటను ఆడుతూ ఎవరైనా దగ్గర బాలు ఆగుతుందో చీటీలో ఏమి రాసి ఉంటే అది చేయాలి అనే ఆటను ఆడారు. అనంతరం నగరవణాన్ని చుట్టూ తిరిగి ప్రకృతి అం దాలను పక్కనే ఉన్న చెరువులో బోటులో తిరిగి ఆనంద పరవశులయ్యారు. ఈ సందర్భంగా వైయస్ భారతి జన్మ దినాన్ని కార్యక్రమానికి ముందుగా మేయర్ బి వై రామయ్య ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఎం ఏ. హాఫీస్ ఖాన్, ఎమ్మెల్సీ మధుసూదన్ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో వైయస్ భారతి జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ ను కట్ ఒకరి కొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమానికి టౌన్ ప్లానింగ్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు, ఎస్వీ మోహన్ రెడ్డి వర్గం కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు.



మ్యూజికల్ చైర్స్ ఆటలో మేయర్, అధికారులు , సిబ్బంది

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : టిజి.భరత్

భారీగా తెలుగుదేశం పార్టీలోకి యువత చేరిక

ప్రజాశక్తి-కర్నూలుహాస్పిటల్ :

యువతకు మంచి భవిష్యత్తు కావాలంటే టిడిసి వచ్చే ఎన్నికల్లో గెలవాలని టిడిపి ప్రభుత్వం తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టిజి. భరత్ అన్నారు. శనివారం నగరంలోని మౌర్యఇన్‌లో హెచ్‌డిఆర్ యూత్ నాయకుడు శివ ఆధ్వర్యంలో జనార్ధన్‌తో పాటు భారీగా యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. 6వ వార్డుకు చెందిన మాలిక్ బాషాతో పాటు పలువురు స్థానికులు టిడిపి నేత ఇబ్రహీం ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. టిజి భరత్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చి యువకులు సరైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులను యువత అర్థంచేసుకొని ప్రజల్లో కూడా చైతన్యం తీసుకురావాలని కోరారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే యువత భవిష్యత్తుకు మంచి మార్గం తీసుకొస్తారన్నారు. ఇక కర్నూలులో తాను ఎమ్మెల్యే అయితే ఈ ప్రాంతం రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో శ్రీకాంత్, కిరణ్, నవీన్, ముక్తియార్, శంకర్, అనిల్, వినోద్, ఉన్నారు. పార్టీ నేతలు మెహబూబ్, విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న గౌరుచరితారెడ్డి

వైసిపి అరాచక పాలనను అంతం చేద్దాం : గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు అంతం చేద్దామని పాణ్యం టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో టిడిపి జెండాను గౌరు చరిత రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటి ప్రచారంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించి, గ్రామంలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇంచార్జి గౌరు చరిత రెడ్డి ప్రజలకు వివరించారు. బొల్లవరం గ్రామ నాయకులు జయన్న గౌడ్, విజయ్ కుమార్, బివిజి మస్తాన్ నాయుడు, పివి.రమణ రెడ్డి, ఎం.మదు, పి.లక్ష్మన్న, జానకి రాముడు, వెంకటేశ్వర్లు, దున్నపోతుల మస్తాన్ నాయుడు, సురేంద్ర, కల్లూరు మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కల్లూరు మాజీ ఎంపిపి వాకిటి మాధవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేశ్ గౌడ్, మైనారిటీ నాయకులు దొడ్డిపాడు బాషా, ఖాసిం, పుసులురుకృష్ణ, సుందరం, లక్ష్మీపురం రాధాకృష్ణ రెడ్డి, శేఖర్ కళ్యాణ్, బస్థిపాడు రాజు, మాజీ ఎంపిటిసి లక్ష్మన్న, ఐటిడిపి మధు, రేమదూరు రామ నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేట్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యేలు, మేయర్ ఇతర నాయకులు

ఘనంగా వైఎస్ భారతి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా వైసిపి కార్యాలయం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైఎస్. భారతి రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, నగర మేయర్ బివై రామయ్య, పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, జిల్లా పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను ఆశీర్వదించండి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ - నేమకల్లులో 'గడపగడపకు మన ప్రభుత్వం' - నూతన సచివాలయం ప్రారంభోత్సవం, సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అయ్యాక ప్రతి ఇంట్లోనూ మంచి జరిగిందా లేదా అని ప్రజలు ఆలోచించుకోవాలని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ ప్రజలను కోరారు. శనివారం నేమకల్లు గ్రామంలో సర్పంచి ప్రేమ్ కుమార్ అధ్యక్షతన మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి జయరామ్, నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జీ నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులు హాజరయ్యారు. మంత్రి రాక సందర్భంగా సర్పంచి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులందరూ తప్పెట్లు, వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని మంత్రి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రాంపురమయ్య వీధిలో రూ.30 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఒక్క నేమకల్లు గ్రామానికే దాదాపు రూ.26.51 కోట్లు వచ్చాయన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పడం లేదని, ఒకసారి సచివాలయాన్ని సందర్శించి ఎవరైనా తెలుసుకోవచ్చని చెప్పారు. గత ప్రభుత్వాలకు, ఇప్పుడు పాలిస్తున్న ప్రభుత్వానికి తేడాను గ్రహించాలని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఉప సర్పంచి అరుణ, సచివాలయ సారథులు సత్తిరెడ్డి, గిరి, రజిని, జెసిఎస్ ఇన్‌ఛార్జీ కన్వీనర్ గురునాథ, సర్పంచులు నీలకంఠ, గోవిందరాజులు, ఎంపిటిసిలు సుంకన్న, భీమ లింగ, వైసిపి ఎస్సీ మండల కన్వీనర్ నాగరాజు, బూత్ కన్వీనర్ రాజన్న, విద్యా కమిటీ ఛైర్మన్ అశోక్, వైసిపి నాయకులు వీరాంజనేయులు, గురుదాసు, మోహన్, ఎర్రి స్వామి, మహేష్, రంగస్వామి, నెట్టి, వీరేష్, గోవిందు, నాగేంద్ర, పరమేష్, ధర్మేంద్ర, షేకన్న, మురళీ, పంచాయతీ కార్యదర్శి బాలన్న, ఎంఇఒ బాల నాయుడు, ఎపిఒ మాధవ శంకర్, ఎపిఎం నాగార్జున, పిఆర్ ఎఇ చోళ రెడ్డి, విఆర్ఒ వీరన్న పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి జయరామ్

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బకాయిలు విడుదల చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని స్థానిక సలాంఖాన్ భవనంలో ఎస్‌టియు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గోకారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్నటువంటి 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు, రావలసిన ఆర్థిక బకాయిలు సుమారు రూ.30 వేల కోట్లు గత నాలుగేళ్లుగా ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణం వాటిని చెల్లించే ఏర్పాటు చేయకపోతే దాని ఫలితం రాబోయే సాధారణ ఎన్నికలలో చూపించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉపాధ్యాయుల జీవిత బీమా, ఆర్జిత సెలవు, కరువు భత్యం, 11వ పిఆర్‌సి, భవిష్య నిధి బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణలోని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే రాష్ట్రంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని పేర్కొన్నారు. సిపిఎస్,జిపిఎస్ రెండు విధానాలను ఉపసంహరించుకొని ఒపిఎస్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, పూర్వపు అధ్యక్షులు ఇఎస్ఎన్. మూర్తి, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సి. నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ లు పాల్గొన్నారు.

'జాబ్ నోటిఫికేషన్ విడుదల చేయాలి'

ప్రజాశక్తి - ఆదోని

నిరుద్యోగ యువత కోసం జాబ్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆర్‌యుఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షులు నరేంద్ర డిమాండ్ చేశారు. శనివారం ఆదోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లయినా ఇంతవరకు జాబ్ నోటిఫికేషన్ విడుదల చేయలేదని తెలిపారు. నోటిఫికేషన్ విడుదలవుతుందని నిరుద్యోగులు ఆశతో వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారన్నారు. జాబ్ నోటిఫికేషన్లు విడుదల చేయకపోతే దశవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు రాజు, నవీన్, ప్రభాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో భక్తులకు రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం కల్పించారు. శనివారం ఏకాదశి తిథి సందర్భంగా స్వామి వారి బృందావనాన్ని నిర్మాల్యం చేశారు. అనంతరం బృందావనాన్ని తులసి మాలతో, కాషాయ వస్త్రాలతో అలంకరించారు. రాఘవేంద్ర స్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని దర్శించుకున్నారు. ఏకాదశి సందర్భంగా స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు అన్నదానం, పరిమళ ప్రసాదం విక్రయం లేకపోవడం ఆనవాయితీ.

చెన్నుపాటి జీవితం ఆదర్శనీయం

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయ ఉద్యమ నేత, కీర్తిశేషులు చెన్నుపాటి లక్ష్మయ్య జీవితం ఆదర్శనీయమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.గాదిలింగప్ప తెలిపారు. శనివారం చెన్నుపాటి లక్ష్మయ్య 55వ వర్ధంతి సందర్భంగా ఆదోనిలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాదిలింగప్ప మాట్లాడారు. అంకితభావంతో పనిచేసి ఉపాధ్యయ వృత్తికే వన్నె తెచ్చారన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున, వై.రామాంజనేయులు, యుటిఎఫ్ నాయకులు వై.నారాయణ, జనార్ధన్, రాజాహుసేన్, బసప్ప, రంగన్న, రంగనాయకులు పాల్గొన్నారు.

చెన్నుపాటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి

ప్రజాశక్తి - కౌతాళం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి తెలిపారు. శనివారం సచివాలయం-1 పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఇంకా అర్హులైన వారుంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో అరులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తామన్నారు. వివిధ కాలనీల్లో సమస్యలను గుర్తించి సచివాలయ నిధులతో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సహకార సంఘం అధ్యక్షులు దాట్ల కృష్ణంరాజు, వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, సర్పంచి పాల్ దినకరన్, నాయకులు అవతారం, సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, చౌదరి బసవరాజ్, వడ్డే రాముడు, అబ్దుల్ సమద్, భీమేష్, నర్సారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

పథకాలను వివరిస్తున్న దేశాయి ప్రహ్లాద చారి

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : వ్యకాస

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న సుమారు 8 వారాలు వేతనాలను చెల్లించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొత్తూరు గ్రామంలో వ్యకాస మండల అధ్యక్షులు రంగన్న అధ్యక్షతన ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈఏడాది తీవ్ర కరువు పరిస్థితుల వల్ల ఉపాధి పనులు గత నవంబర్ ముందు నుంచే ప్రారంభమయ్యాయని తెలిపారు. చాలా గ్రామాల్లో చేసిన పనికి నేటికీ వేతనాలు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు పనులకు వెళ్లే పరిస్థితి లేదని, వారికి అదనంగా మరో వంద రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. వేతనం కూడా రోజుకు రూ.600 ఇవ్వాలని, కొలతల రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన నిబంధన ముఖ హాజరును రద్దు చేయాలని కోరారు. వ్యకాస గ్రామ కమిటీ కార్యదర్శి కర్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న లింగన్న

చెన్నుపాటి ఆశయ సాధనకు కృషి

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, ఉద్యమ రథ సారథి చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి యు.చంద్రపాల్ కోరారు. శనివారం గోనెగండ్లలోని బస్టాండ్ పాఠశాలలో యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు డి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అన్ని కేడర్ల వారిని ఏకతాటిపైకి తీసుకొచ్చి ఉపాధ్యాయ ఉద్యమాన్ని నడిపించిన మొదటి తరం నాయకుల్లో చెన్నుపాటి ప్రముఖులని తెలిపారు. ఉపాధ్యాయుల వాణి సామాన్యులకు తెలియజేయడానికి మనకు సొంత పత్రిక ఉండాలనే ఆకాంక్షతో పత్రికను నడిపారని చెప్పారు. ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రను, ఉపాధ్యాయ సర్వీస్ విషయాలు అందరికీ తెలిసేలా చేసిన ఘనుడని కొనియాడారు. చెన్నుపాటిని ఆదర్శంగా తీసుకుని అందరూ సంఘం బలోపేతానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేయాలని కోరారు. నాగేశ్వరరావు, ఖాజన్న, అక్బర్, నాగరాజు, విజయ్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

దేవనకొండలో ప్రబలిన అతిసార

- కర్నూలు ప్రభుత్వాస్పత్రికి ఇద్దరి తరలింపు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో అతిసార ప్రబలడంతో 8 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... గ్రామంలోని పాత మార్కెట్ కాలనీకి చెందిన బాల రంగడు, భూలక్ష్మి, మస్తాన్ వలీ, మహబూబ్, నబి రసూల్, ప్రవీణ్, నరసప్ప, సుశాంత్‌లు వాంతులు, విరోచనాలకు గురయ్యారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాల రంగడు, భూలక్ష్మి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ కాలనీలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కావడంతో అతిసార ప్రబలినట్లు ఆ కాలనీ వాసులు తెలిపారు. అతిసార గురించి ప్రాథమిక వైద్యాధికారి విజయ భాస్కర్‌ను ప్రశ్నించగా... వ్యాధి ప్రబలిన వారికి వైద్య చికిత్సలు అందించామని, ఇద్దరిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించామని తెలిపారు. తాగునీటి పైపులైన్ లీకేజీ కావడం వల్ల నీరు కలుషితమైందని, సంబంధిత పంచాయతీ అధికారులు తక్షణమే తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆ కాలనీవాసులు కోరారు.

బాలునికి వైద్య చికిత్సలు అందిస్తున్న వైద్యులు

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు
- మార్కెట్ యార్డులో రైతులతో సదస్సు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పత్తి పంట సాగు చేసిన ప్రతి రైతుకూ క్వింటాకు రూ.10 వేల గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో పత్తి రైతులతో జిల్లా సదస్సు నిర్వహించారు. రైతుసంఘం మండల అధ్యక్షులు శేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఆదోని అభివృద్ధి వేదిక నాయకులు ఆదినారాయణ, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.పరమేష్ మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు పత్తి పంటకు కనీసం మద్దతు ధర నిర్ణయించి అమలు చేయాలని కోరారు. పత్తి పంటకు క్వింటాకు రూ.2 వేలు బోనస్‌గా ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, సిసిఐ ద్వారా పత్తి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 6 లక్షల హెక్టార్లలో రైతులు పత్తి పంటను సాగు చేస్తుంటే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2 లక్షల హెక్టార్లకు పైగా పత్తి పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.6-7 వేలకు మించి ధర పలకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పద్ధతిలో పత్తి ధరలు కొనసాగితే భవిష్యత్తులో పత్తి సాగు తగ్గే అవకాశం ఎక్కువ ఉందని తెలిపారు. ప్రభుత్వం పత్తికి క్వింటాకు రూ.10 వేల గిట్టుబాటు ధర కల్పించేందుకు పోరాడాలని కోరారు. రైతుసంఘం మండల కార్యదర్శి బి.అయ్యప్ప, జిల్లా నాయకులు ఈరన్న, మండల నాయకులు చిన్నతిక్కన్న, హనుమంతు రెడ్డి, ఏలియా, రంగనాథ్, రహిమాన్, రైతులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశులు

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ సతీష్ కుమార్

క్రీడలతో స్నేహభావం పెంపు

- ఎస్ఐ సతీష్ కుమార్

ప్రజాశక్తి - కోసిగి

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా శనివారం గ్లోబల్ ఇండియా క్రికెట్ టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ సతీష్ కుమార్, వైసిపి సీనియర్ నాయకులు మాణిక్య రాజు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని కోరారు. ఈ టోర్నమెంట్‌కు మొత్తం 30 క్రికెట్ జట్లు వచ్చినట్లు ఆర్గనైజర్లు రాజు, వీరేష్ తెలి పారు. వైసిపి నాయకులు కోసిగయ్య, రాజేష్, లక్ష్మన్న, మల్లయ్య, మాజీ జడ్‌పిటిసి వెంకటేష్ పాల్గొన్నారు.

వికలాంగుల డిమాండ్లను నెరవేర్చాలి : విహెచ్‌పిఎస్

ప్రజాశక్తి - గోనెగండ్ల

వికలాంగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నాయకులు డిమాండ్ చేశారు. వికలాంగుల డిమాండ్ల సాధన కోసం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదోని నుంచి కర్నూలు కలెక్టరేట్ వరకు చేపట్టిన 100 కిలోమీటర్ల పాదయాత్ర శనివారం గోనెగండ్లలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు పార్లపల్లి రామాంజనేయులు, సోమన్న, నాగరాజును పూలమాలలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ... వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో పాటు బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పింఛను రూ.6 వేలకు పెంచి ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు పక్కా గృహాన్ని ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు గంజిహళ్లి మహదేవ మాదిగ పాల్గొని సంఘీభావం తెలిపారు.

మాట్లాడుతున్న విహెచ్‌పిఎస్ నాయకులు

వాల్మీకి ద్వారా రాముని గొప్పతనం తెలిసింది

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ద్వారా శ్రీరాముడు ఆదర్శ ప్రాయుడని, సత్య వాక్య పరిపాలకుడైన శ్రీరాముని గొప్పతనం ప్రపంచానికి తెలిసిందని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణకు ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాల్మీకుల ఆరాధ్య గురువైన వాల్మీకి మహర్షి రచించిన గ్రంథం ద్వారా శ్రీరామచంద్రుడు పితృ వాక్య పరిపాలకుడని, భార్యాభర్తలకు సీతాదేవి, శ్రీరాముడు ఆదర్శమని, రామలక్ష్మణ, భరత, శత్రుఘ్నులు అన్నదమ్ముల సఖ్యతకు నిదర్శనమని ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. అలాంటి మహనీయుని విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అంతకుముందు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు ట్రాక్టర్ దుళ్లయ్య మాట్లాడారు. గ్రామంలోని బీరప్ప గుడి వద్ద ఉన్న స్థలంలో ప్రత్యేక హోమాలు చేసి సుమారు రూ.2 లక్షలతో వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా వంద ఇళ్ల నుంచి రూ.2 వేల చొప్పున వసూలు చేసినట్లు చెప్పారు. కొందరు ముఖ్యమైన యువకులు ఒక్కొక్కరు రూ.20 వేల చొప్పున వేసుకుని కార్యక్రమాన్ని జయప్రదం చేశామని తెలిపారు. ఏ రాజకీయ నాయకుల నుంచి విరాళాలు సేకరించకుండా కులస్తులందరూ కలిసి విరాళాలతో కార్యక్రమం విజయవంతం చేశామని చెప్పారు. ఉలువ భీమయ్య, లక్ష్మయ్య, చేపల నాగేష్, బిచ్చాలి రామాంజిని, చిన్న నాగేష్, చిన్న ఈరన్న, పెద్ద ఈరన్న, తిక్కస్వామి, గుడిసె తిక్కస్వామి, తలారి గోవిందు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీసుభుదేంద్రతీర్థులు

వాల్మీకి విగ్రహానికి పీఠాధిపతుల విరాళం

మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో ఆవిష్కరించిన వాల్మీకి మహర్షి విగ్రహానికి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రూ.50 వేల విరాళం ప్రకటించారు. చెట్నిహళ్లి చేరుకున్న ఆయనకు అక్కడి వాల్మీకులు డప్పు వాయిద్యాలతో బాణసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీమఠం నుంచి తన వంతు సహకారంగా రూ.50 వేల విరాళం ప్రకటించారు.

పేదల అభ్యున్నతే జగన్ సంకల్పం

- మున్సిపల్ ఛైర్మన్ శాంత

ప్రజాశక్తి - ఆదోని

బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంకల్పమని మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, జెసిఎస్ పట్టణ కన్వీనర్ వెల్లాల మధుసూదన్ శర్మ, వార్డు ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆదోని పట్టణంలోని 21వ వార్డులో కౌన్సిలర్ లక్ష్మీ దేవి అధ్యక్షతన 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కరోనా కష్టకాలాల్లో కూడా వివక్ష లేకుండా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇన్ని పథకాలు అమలు పరచలేదన్నారు. ఇది కేవలం జగన్మోహన్ రెడ్డికే సాధ్యమన్నారు. 2024లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని, సాయిప్రసాద్ రెడ్డిని గెలిపించుకుంటే రాష్ట్రంతోపాటు ఆదోని మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వార్డు కన్వీనర్లు చిన్న గౌడ్, రంగస్వామి, లక్ష్మన్న, రఫీక్, లలిత, రేఖమ్మ, సురేష్, మంజునాథ్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

జాతీయ కాంగ్రెస్ పూర్వ అధ్యక్షులు సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలను శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్పతో పాటు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతిరావు, పార్టీ సీనియర్ నాయకులు సాయినాథ్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు నూర్ అహ్మద్, యువ నాయకులు శ్రీనిత్‌లు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ పదవులను ఆశించే వారు కాదని, దేశ ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా ఇతరులకు అవకాశం కల్పించారని కొనియాడారు. ఎపిలో కూడా పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. ఐఎన్‌టియుసి నాయకులు జయరాం, కెకెసి జిల్లా నాయకులు ఇర్ఫాన్, మద్దిలేటి, గోవిందు, రామన్న యాదవ్, షేక్షావలీ, హుస్సేన్, రాము పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని 1వ వార్డు వాల్మీకి నగర్‌లో వెలసిన శ్రీఆణిముత్యం ఆంజనేయస్వామి దేవాలయం 3వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వార్డు కౌన్సిలర్ పార్వతి తెలిపారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేష్, వీరేష్, నాగేంద్ర, కృష్ణ, ఈరన్న, వంశీ, గుంటప్ప, కన్నప్ప, ప్రతాప్ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ పార్వతి

వైసిపి గెలుపునకు కృషి : మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - హొళగుంద

రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి శాయశక్తుల కృషి చేస్తానని వైసిపి జిల్లా కోశాధికారి కొత్త కాపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఎల్లార్తి గ్రామంలో కార్యకర్తలతో కలిసి వైసిపి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఉంచిన ప్రతి హామీనీ నెరవేర్చారని తెలిపారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా నేరుగా ప్రతి సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాల్లో ప్రతి గ్రామాన్ని చుట్టేసి ప్రజలు ప్రస్తుత పరిస్థితుల్లో ఎదుర్కొంటున్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో ముందుంటామని, ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆర్థికంగా ఆదుకోవడం తనకు సంతృప్తిని ఇస్తుందని చెప్పారు. అంతకుముందు స్థానిక ఆంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, దుమ్ము హనుమంతు, చాకలి బడే సాబ్, గోపి, చంటి పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న కొత్త కాపు మధుసూదన్ రెడ్డి

పవమానాచార్యుల మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం ప్రధాన అర్చకులు పవమానాచార్యుల మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి భీమయ్య, మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, నాయకులు జనార్ధన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. బెంగళూరులో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిన పవమానాచార్యుల మృతదేహం శనివారం స్థానిక సంత మార్కెట్ ఆవరణకు చేరుకోవడంతో వైసిపి, టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.


సంతాపం తెలియజేస్తున్న నాయకులు

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో
ఓ.ఎస్.నెం.691/2021

బి.శ్రీనివాసులు. ...వాది

(ఎదురి)

ఏ.ప్రకాష్ పోతి వారసులు
మరియమ్మ వగైరా. ...ప్రతివాదులు

3 ప్రతివాదికి దావా సమన్లు

3) ఏ.తిలక్ తండ్రి లేట్ ఏ.ప్రకాష్,
ఇంటి నెంబర్ 50/1090 రైల్వేగేట్ దగ్గర,
దేవనగర్, కర్నూల్ సిటి.

పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ.2,07,000/-లు ఇందు పైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో 3వ ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 20/12/2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మాంచబడును.

(కోర్టువారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది : 20/12/2023

పి. సువర్ణా రెడ్డి,
అడ్వకేట్, కర్నూలు.
సెల్ నెంబర్ : 94403 44738



ఆశా వర్కర్ల సమస్యలపై

14, 15 తేదీల్లో 36 గంటల నిరసన దీక్ష

- జయప్రదం చేయాలి : సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి - నంద్యాల

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని ఈ నెల 14, 15వ తేదీలోల నంద్యాల కలెక్టర్ కార్యాలయం ముందు 36 గంటల నిరసన దీక్ష, వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రమణ కుమారి తెలిపారు. 36 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం నంద్యాల పట్టనంలోని సిఐటియు కార్యాలయంలో నిరసన దీక్ష వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాల అమలు, ఆశల నియామకాల్లో రాజకీయ నాయకుల జోక్యం తగ్గించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఆశలను కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, వేతనంతో కూడిన మేటర్నరీ లీవులు అమలు చేయాలని కోరారు. ఇల్లు లేని వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోవిడ్ కాలంలో చనిపోయిన ఆశాలకు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, మరణించిన కుటుంబాల్లో ఒకరిని ఆశలుగా తీసుకోవాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 14, 15వ తేదీలలో కలెక్టరేట్ ముందు జరిగే 36 గంటల నిరసన దీక్షలతో పాటు వంటావార్పు కార్యక్రమంలో జిల్లాలోని ఆశా వర్కర్లు అందరూ పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వి.బాల వెంకట్, డి.లక్ష్మణ్, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు షమీం, శిరోమణి, వసంత తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

బతుకులు దయనీయం...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. నిర్మాణ రంగంలో దాదాపు 36 రకాల పనులు చేసేవారున్నారు. బోర్లు తీసేవారు, రాడ్ బెండింగ్, తాపీ పని, సెంట్రింగ్, ప్లంబింగ్, కార్పెంటర్, ఎలక్ట్రిషీయన్లు, మార్బుల్స్ అతికేవారు, ఇటుక బట్టీల్లో పని చేసేవారు, కాంక్రీట్ మిల్లర్లు, భవన నిర్మాణ కార్మికులు ఇలా వీరందరూ నిర్మాణ రంగంపై ఆధారపడి బతుకుతున్నారు. వీరంతా రోజువారీ పనులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తుంటారు. తాపీ మేస్త్రీకి రూ.900 నుంచి రూ.వెయ్యి, పని చేసే కార్మికులకు రూ.500 నుంచి రూ.600 వరకూ కూలి ఉంటుంది. నెలంతా పని చేస్తేనే వీరికి ఇల్లు గడుస్తోంది. ఇసుక సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడంతో గడిచిన మూడు నెలలుగా నిర్మాణ రంగం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పనుల్లేక కార్మికులు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. ఆదాయం లేకపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబాలు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు కొనసాగుతున్నా ధరలు చూస్తే గుండె గుబేలుమంటోంది. మూడు నెలల క్రితం వరకూ పది చక్రాల లారీ ఇసుక రూ.18 వేల నుంచి రూ.20 వేలు వరకూ ఉండేది. ఇప్పుడు రూ.30 వేల నుంచి రూ.32 వేల వరకూ ధర పలుకుతోంది. మొన్నటి వరకూ టన్ను ఇసుక రూ.వెయ్యి ఉండగా ప్రస్తుతం రూ.1500 వరకూ పలుకుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.1200 ఉండేది కాస్తా రూ.ఐదు వేలకు చేరింది. బ్లాక్‌మార్కెట్లో ఇసుక కొనుగోలు చేయాలంటే చుక్కలు కన్పిస్తున్నాయి. నిర్మాణ రంగం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వైసిపి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఉచిత ఇసుక పాలసీని రద్దు చేసి కొత్త పాలసీ ప్రకటించడంలోనూ జాప్యం చేయడంతో భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులు నెలల తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దఎత్తున ఉపాధి పొందే రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిల్లలకు ఫీజులు కట్టలేక, ఇల్లు గడవక అప్పులు తెచ్చి కార్మికుల కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ఇసుక సరఫరాను వేగవంతం చేసి నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులను ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

కొత్తపల్లి మండలం సింగరాజు పల్లి గ్రామంలో గంగరేగు వాగుపై నిర్మించిన చెరువులో డెడ్ స్టోరేజ్‌లో ఉన్న నీళ్లను కొంతమంది అక్రమంగా ఆయిల్ ఇంజన్లు వేసుకొని తరలించుకు పోతున్నారని, వారిపై చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని ఎపి రైతు సంఘం నాయకులు ఆయకట్టు రైతులతో కలిసి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఇఇ రఘురామి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నందికొట్కూరు మండలంలోని మల్యాల దగ్గర ముచ్చుమరి ఎత్తిపోతల పథకం నుండి హంద్రీనీవాకు నీటిని తరలించే కాల్వపై బ్రిడ్జిని వెంటనే ఏర్పాటు చేయాలని జల వనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ల కార్యాలయం, హంద్రీనీవా సుజల స్రవంతి ఈఈ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్థంతి సందర్భంగా ఆయనకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఘంటసాల జయంతి వేడుకలు నిర్వహించారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఎస్సీ మహిళలకు సెర్ఫ్ - ఉన్నతి మహిళా శక్తి పథకం కింద ఆటో రిక్షాలను పంపిణీ చేశారు.

నల్లమల ఘాట్‌లో ట్రాఫిక్ జామ్

- శ్రీశైలం నుండి 7 కిలోమీటర్ల మేర ఆగిన వాహనాలు
- 3 గంటల పాటు ఇబ్బందుల్లో భక్తులు, యాత్రికులు

నల్లమల ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్ జామ్ కావడంతో నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం నల్లమల ఘాట్ రోడ్డులో శనివారం ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు ఏడు కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయాయి. మూడు గంటల సేపు వాహనదారులు, భక్తులు, యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్తీక మాసం ముగుస్తున్న సమయం, దీనికి తోడు రెండవ శనివారం, ఆదివారం సెలవు రోజులు, సోమవారం, మంగళ వారాల్లో అమావాస్య ఉన్నందున శనివారమే స్వామి అమ్మవార్లను దర్శించు కునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి భక్తులు శ్రీశైలం క్షేత్రానికి పెద్ద ఎత్తున వాహనాల్లో తరలివచ్చారు. దీంతో శ్రీశైలం నుండి సుమారు ఏడు కిలోమీటర్ల మేర మూడు గంటల పాటు వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ జామ్ కావడంతో చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు, చిన్నారులు తాగునీరు దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఈ సమస్య ప్రతి శని, ఆది, సోమవారాల్లో ఎదురవుతూనే ఉందని క్షేత్ర పరిసరాల్లోని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. కానీ ఈ రోజు మాత్రం ట్రాఫిక్ జామ్ ఎక్కువగా అయిందని చెబుతున్నారు. అధికారులు, పోలీసులు ఈ సమస్యపై ప్రత్యేక ఆలోచనలు చేసి సరైన మార్గం వైపు అడుగులు వేసి వాహనాలు జామ్ కాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యతఉంది. దీనికి తోడుగా అటవీ శాఖ వారు రోడ్డు దిగకూడదని, పక్కన కర్రలు పాతడం యాత్రికులను మరింత ఇబ్బంది పెడుతోంది. ఇటు దోర్నాల వైపు నుండి, అటు హైదరాబాదు వైపు నుండి శ్రీశైలంలోకి ప్రారంభమై ముఖద్వారం నుండి రోడ్డును మరింత వెడల్పు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన బాధ్యత అటవీశాఖపై, పోలీసులు, దేవస్థానం అధికారులపై ఉంది.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని హనీఫ్ నగర్‌లో ఉన్న రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో చెస్ జిల్లా సంఘం నిర్వహణలో నంద్యాల జిల్లా స్థాయి చదరంగం పోటీలు శనివారం ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా చెస్ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సుబ్బయ్య, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ విద్యాశ్రీ, రాష్ట్ర చెస్ సంఘం జాయింట్ సెక్రెటరీ రామ సుబ్బారెడ్డి హాజరయ్యారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ చదరంగం పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. తద్వారా చదువులలో కూడా రాణించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. నిరంతర సాధన ద్వారా క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. చెస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ జిల్లాస్థాయి పోటీలలో చూపిన ప్రతిభ ఆధారంగా విజయవాడ, తిరుపతిలలో జరగనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో పాల్గొనేందుకు జిల్లా జట్టు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో దాదాపు 150 మంది చదరంగం క్రీడాకారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చెస్ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

చైర్మన్‌కు వినతిపత్రం అందచేస్తున్న అల్‌మేవా నాయకులు

స్మశాన వాటికలకు ప్రహరీ, రోడ్డు నిర్మించాలి

- మునిసిపల్ చైర్మన్‌కు ఆల్ మేవా వినతి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో గత ప్రభుత్వం హిందూ, ముస్లిం, క్రైస్తవుల కోసం కేటాయించిన స్మశాన వాటికలకు ప్రహరీ, రోడ్డు నిర్మాణం చేపట్టాలని అల్‌మేవా జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ఎండి.అబులైస్, జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ పాషాలు మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. శనివారం నంద్యాల మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాను ఆమె స్వగృహంలో అల్‌మేవా నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా అయిన తర్వాత నంద్యాల టౌన్‌లో అన్ని మతాల జనాభా పెరిగిపోయిందని తెలిపారు. ఇప్పుడున్న స్మశానవాటికలు సరిపోక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వైఎస్సార్ నగర్‌లోని హిందూ, ముస్లిం, క్రైస్తవుల కోసం కేటాయించిన స్మశాన వాటికలకు చేరుకోవడానికి రోడ్డు వసతి కల్పించాలని, ప్రహరీల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా ఉపాధ్యక్షులు ముహమ్మద్ రఫీ, కోహినూర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బలిజలు అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె : బలిజలు ఐకమత్యంతో అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ కృష్ణదేవరాయల బలిజ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో కార్తీక మాసం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బలిజ సంఘీయులతో తమ కుటుంబానికి విడదీయరాని బంధం ఉందన్నారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు తనవంతుగా స్థల కేటాయింపు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివరామయ్య, బలిజ సంఘం నాయకులు రామసుబ్బయ్య, నీలి పుల్లన్న, కిషోర్ కుమార్, నామాల మహేష్, పివి. సుబ్బారావు, భాస్కర్, బాల ఈశ్వరయ్య, యాగంటి శ్రీని వాసులు, పల్లె తిరుపతయ్య, అవుకు రామన్న, రవి పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం : ఇరిగెల

ప్రజాశక్తి - రుద్రవరం : టిడిపి, జనసేన పార్టీల కలయికతో రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడుతామని జనసేన పార్టీ శిరివెళ్ళ మండల ఇంచార్జ్ ఇరిగెల ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామంలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికి జనసేన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు ఏ రకమైన పరిపాలన అందిస్తుందనే విషయంపై ఇంటింటికి వెళ్ళి మేనిఫెస్టో వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పసుల నరేంద్ర, సీనియర్ నాయకులు పెసరవాయి చాంద్ బాషా, ఆలమూరు గౌస్, పెద్ద బాలయ్య, ఇబ్రహీం ఖాన్, మాలిబాషా , పెసరవాయి ఇబ్రహీం, తేజా నాథ్, తరుణ్ ఆచారి, గంగవరం నాయకులు పాల్గొన్నారు.

త్వరలోనే సూర్యనంది క్షేత్రానికి వస్తా : శాంభవి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : సూర్యనంది క్షేత్రానికి త్వరలోనే వస్తామని శాంభవి పేర్కొన్నారు. శనివారం ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం క్షేత్రాన్ని ఆమె దర్శించుకున్నారు. ఎగువ, దిగువ అహోబిలంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 12 సంవత్సరాల క్రితం సూర్య నంది క్షేత్రంలో శాంభవి ఒక వెలుగు వెలిగారు. అనంతరం జరిగిన పరిణామాలతో ఆమె హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్లిపోయారు. అహోబిల క్షేత్రాన్ని దర్శించుకున్న తర్వాత ఆమె జనసేన తాలూకా నాయకులు ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి నివాసానికి చేరుకున్నారు.

ప్రజల్లో మార్పు మొదలైంది : కాంగ్రెస్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రజల్లో మార్పు మొదలైందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని ఆ పార్టీ నంద్యాల పార్లమెంటు జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు బరగోడ్ల హుస్సేన్ భాష ఆధ్వర్యంలో ఏపిసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ 77వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జె.లక్ష్మి నరసింహ యాదవ్ హాజరై కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం వెంటపడే ఈ రోజుల్లో ప్రధానమంత్రి పదవిని సైతం తీసుకోకుండా మన్మోహన్ సింగ్‌నే రెండుసార్లు పది సంవత్సరాలు పాటు కొనసాగించిన ఘనత సోనియా గాంధీకే దక్కిందన్నారు. వారి కుటుంబంలో ఇందిరాగాంధీ, సోనియా గాంధీ భర్త రాజీవ్ గాంధీ దారుణ హత్యకు గురైనా బెదరకుండా దేశ భద్రత కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి తన ఇద్దరు పిల్లలను కూడా ప్రజల్లోకి పంపి ప్రజాసేవకే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి సోనియా గాంధీ అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. పాత నాయకులు తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అత్తార్ రఫీ, దొర్నిపాడు, చాగలమర్రి, సిరివెళ్ల మండలాల అధ్యక్షులు నాగయ్య, పాపాజీ, పసుపులేటి లక్ష్మి నరసింహ, సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ సంజీవ కుమార్, మహబూబ్ బాషా, నవీన్, శ్రీపతి లక్ష్మయ్య, శేఖర్, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ బాషకు కేక్ తినిపిస్తున్న లక్ష్మీ నరసింహ యాదవ్

వెంకటేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం సమీపంలోని వెలగలపల్లె గ్రామ పొలి మేరలో వెలసిన శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసంలో భాగంగా రుద్రవరం, వెలగలపల్లె, కొండమాయపల్లె, అప్పనపల్లె గ్రామాలతోపాటు ఆళ్లగడ్డ, శిరివెళ్ల, నంద్యాల, దొర్నిపాడు, చాగలమర్రి తదితర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అల్పాహారం, తాగునీరు ఏర్పాటు చేశారు.

వైభవంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని రవ్వలకొండ సమీపంలో వెలసిన చెంచు లక్ష్మి సమేత పావన నరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారికి కళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని ఆలయ పూజారి బాలిశెట్టి పావన నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పొద్దుటూరు వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బీరవోలు గ్రామం, చిన్న రాజు పాలెం తండా, పసుపుల తండాలలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువుతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సంక్షేమం పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. వైసిపి నిరంకుశ రాజ్యసపాలనకు చరమ గీతం పాడాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్య మన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అంబాల రామకృష్ణారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణ నాయక్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, టిడిపి నాయకులు షేక్షావలి, నరసింహులు, రామాంజనేయులు, కామేష్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని తాలుకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని ఎస్‌వి ప్యాలెస్ వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ముఖ్యంగా టిడిపి వైపు చూస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి టిడిపితోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, గుండా మణి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి

ఆళ్లగడ్డ : మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

తప్పుడు ప్రచారాలు చేస్తే తరిమి కొట్టండి

- ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై టిడిపి నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తే తరిమికొట్టాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో వార్డు ఇంచార్జ్ అనిల్ అమృతరాజ్, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 191వ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి గడపకు ఎమ్మెల్యే తిరుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి జెండా ఎగురుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంషావలి, వైసిపి నంద్యాల పట్టణ అధ్యక్షులు పున్న శేషయ్య, జాకీర్ హుస్సేన్, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు, కౌన్సిలర్లు కృష్ణమోహన్, సాదిక్ భాష, పార్థుడు, రహంతుల్లా, కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ, అంజి, రామ చంద్రుడు, మా బాషా, అప్పన్న, వార్డ్ నాయకులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం వైసిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం సిరివెళ్ళ మండలం యర్రగుంట్ల గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని మళ్లీ గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచి సుభాన్ వలి, ఉపసర్పంచి సత్తార్ ప్రతాపరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాజా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పేకాట రాయులను అరెస్టు చేసిన పోలీసులు

నల్లమల అడవిలో జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని నల్లమల అడవిలో ఉన్న మొండి కట్ట చెరువు వద్ద పేకాట ఆడుతున్న వారిని శనివారం నాడు బండి ఆత్మకూరు ఎస్సై మల్లి కార్జున సమస్య సిబ్బందితో వెళ్లి దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారిలో 11 మందిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు వారి వద్ద నుండి రూ. 1,55, 660లు నగదు, 10 మోటార్ బైకులు, 11 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆత్మకూరు డిఎఫ్ఒను కలిసిన పువ్వాడ భాస్కర్

ప్రజాశక్తి - ఆత్మకూరు

డిఎఫ్ఓఅలాన్ చొంగ్ టెరాగ్ కలిసిన పువ్వాడి భాస్కర్

ఇటీవల హానరరీ వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పువ్వాడి భాస్కర్ శనివారం నాడు ఆత్మకూరు అటవీ శాఖ డివిజనల్ అధికారి అలాన్ చొంగ్ టెరాన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వన్యప్రాణి సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకు ంటున్న చర్యలు అటవీ శాఖలో వన్యప్రాణి సంరక్షణ కోసం చేస్తున్న కార్య క్రమాలు తదితర వాటి విషయాలపై పువ్వాడి భాస్కర్ అడవి శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజనల్ అటవీ శాఖ అధికారి అటవీశాఖ పరిధిలో ఉన్న వన్య ప్రాణుల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యం గురించి పువ్వాడ భాస్కర్‌కు వివరించడంతోపాటు కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి శివ శంకర్రెడ్డి, వైసిపి నాయకులు మొగిల్ల పల్లె రామచంద్రయ్య శెట్టి, మాజీ ఎంపిటిసి వరప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

గర్భిణీ స్త్రీలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

జువ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నందు శనివారం గర్భిణులకు అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ గత 6 సంవత్సరాల నుండి వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ వైద్యశాలకు వైద్యం కోసం వచ్చే గర్భిణులకు, వారితో పాటు సహాయకులకు పౌష్టిక ఉచిత అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరిం చుకొని మల్యాల ఆవుల శివశంకర్, దండుగుల మధు శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ పూర్ణేశ్వర్ రావు మాట్లాడుతూ లాంటి కార్యక్రమాలను నిర్వహి ంచడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి శ్రీనివాసులు, కెమిస్ట్రీ సురేష్ , మధు యాదవ్, డివి నాయక్, పరమేష్ ఉదయ్, హరి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో పెరుగుతున్న రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం

భక్తులు రద్దీగా ఉన్న దృశ్యం

కార్తీక మాసంలో చివరి వారం కావడం, రెండవ శనివారం సెలవు దినాలు కావడంతో శ్రీశైలంలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. భక్తులు రద్దీ పెరిగిన దానిని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం అధికారులు స్పర్శ దర్శనం, ఆర్జిత సేవలను నిలుపుదల చేశారు. అయినప్పటికీని భక్తుల రద్దీ పాతాళ గంగలో స్నానాలు ఆచరించి అనంతరం క్యూ లైన్లో గంటల తరబడి వేచి ఉండి స్వామి అమ్మవార్ల అలంకార దర్శనం చేసుకుంటు న్నారు. స్వామియే మూలం దర్శించుకునేందుకు మూడు, నాలుగు గంటల సమయం పడుతుం దని భక్తులు తెలిపారు. క్షేత్రపరిధిలో గంగాధర మండపం వద్ద, ఉత్తర మాడ విధుల్లో భక్తులు అధిక సంఖ్యలో కార్తీకదీపం వెలిగించి పూజలు నిర్వహిం చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఉండేందుకు ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని పార్కింగ్ స్థలాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేవిధంగా డిఎస్పి తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా సీసీ కెమెరాలు ద్వారా అనుక్షణం పర్యవేక్షిస్తున్నారు.

మద్దిలేటి స్వామి ఆలయ ఆదాయం రూ.8.70 లక్షలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లకు ఈ శనివారం ఆదాయం రూ. 8,70,061 లక్షలు వచ్చినట్లు ఈవో పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతా రామ చంద్రుడు తెలిపారు. కార్తీక మాసంలో చివరి శనివారం అయినందున భక్తులు తెల్లవారుజామున రెండు గంటల నుండి భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడం జరిగిందని తెలిపారు. స్వామి వారి లడ్డు ప్రసాదం, కళ్యాణ కట్ట, కేశఖండనం, రూము బాడుగలు, చిరు వ్యాపారస్తుల రుసుములు వంటి వాటి వల్ల అక్షరాలా ఎనిమిది లక్షల 70 వేల 61 రూపాయలు ఆదాయం వచ్చిందని వారు అన్నారు. అనంత పురం జిల్లా గుంతకల్లు పట్టణం ఎస్బిఐ కాలనీ నివాసి అయిన కే ఓబులయ్య ఆలయం అభివృద్ధి కొరకు స్వామివారికి విరాళంగా లక్ష రూపాయల చెక్కులు ఈవో పాండురంగారెడ్డికి సమర్పించారు. ఈనెల 21 తేదీ నుండి 23వ తేదీ వరకు ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి జంతుబలి చేయరాదని భక్తులకు వారు తెలియజేశారు.

ఘనంగా చర్చి ప్రతిష్ట వేడుకలు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామంలో 131వ చర్చి ప్రతిష్ట దినాన్ని శనివారం డీనరీ చైర్మన్ రెవరెండ్ వరప్రసాద్ అధ్యక్షతన ముత్యాలపాడు పరిశుద్ధ జన్మోత్సవ చర్చి ఫాదర్ రెవరెండ్ సంజీవరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా చర్చి ప్రతిష్ట వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఉదయం ప్రత్యేక ఆరాధనను నిర్వహించారు. ప్రతిష్ట దినోత్సవ, క్రీస్తు జన్మదినంల ప్రసంగాన్ని రెవరెండ్ వరప్రసాద్ నంద్యాల అధ్యక్ష ఖండపువైస్ ప్రెసిడెంట్ బోధించారు. అనంతరం గుడి ప్రదక్షణ చేసి ప్రత్యేక ఆరాధనను నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ డీనరీ చైర్మన్ రెవరెండ్ సునీల్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు రెవరెండ్ గ్లడ్ స్టన్, రెవరెండ్ చల్లా స్టీఫెన్, రెవరెండ్ గాబ్రియల్, రెవరెండ్ సువార్త బాబు, రెవరెండ్ రంజిత్ సంఘ పెద్దలు క్రైస్తవులు పాల్గొన్నారు. అనంతరం చర్చి ఆవరణంలో ప్రేమ విందు భోజనాన్ని ప్రతి ఒక్కరికి అందించారు.

రాజేంద్రన్ సేవలు చిరస్మరణీయం : సిపిఐ

ప్రజాశక్తి - బేతంచెర్ల

భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు కే రాజేంద్రన్ సేవలు చిరస్మరణీయమని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నంద్యాల జిల్లా కార్యదర్శి కే రంగనాయుడు అన్నారు. శనివారం ఉదయం రాజేంద్రన్(73) గుండెపోటుతో మరణిండంతో మండల అధ్యక్షుడు వై భార్గవ్ ఆధ్వర్యంలో రాజేంద్రన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. సిపిఐ కేరళ రాష్ట్ర సమితి కార్యదర్శి కె రాజేంద్రన్ మృతి ప్రజాస్వామ్యానికి తీరనిలోటని అన్నారు. వారి ఆశయాలను ఆలోచనలను నేడు దేశంలోని యువత ఆదర్శంగా తీసుకొని పనిచేయాలన్నారు. బేతంచర్ల పాత బస్టాండ్ నందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి కొవ్వొత్తు లతో నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు సిపిఐ మండల కార్యదర్శి వై భార్గవ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ సుగుణమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోట రాముడు, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు తిరుమలేశు, దస్తగిరి, సిపిఐ సీనియర్ నాయకులు సోమన్న, కోన రామకృష్ణ శ్రీరాములు, తిమ్మయ్య, నాగేష్, శంకర్, రామ్ దాస్, శివ, శ్రీను శరత్, ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారం : జడ్జి

కేసులను విచారిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని కోర్టు ఆవరణంలో శనివారం నాడు జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 93 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి వి వెంకటేశ్వరరావు. జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయిలు కేసులను విచారించారు. 57 కేసులు క్రిమినల్, ఆరు సివిల్, రెండు చెక్ బౌన్స్, 23 ఎక్సైజ్ శాఖకు చెందిన కేసులతో పాటు వివిధ కేసులను వారి విచారించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీధర్, అడిగే మాణిక్యరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు లోక్ అదాలత్‌లో 254 కేసులకు పరిష్కారం

నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు పట్టణంలోని కోర్టు ఆవరణ నందు శనివారం నాడు నేషనల్ లోక్ అదాలత్ నందికొట్కూరు ఇంచార్జ్ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కర్నూల్ పి.దివాకర్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.వందన ఆధ్వర్యంలో నిర్వహించారు. లోక్ అదాలత్ నందు 254 కేసులు పరిష్కరిం చబడ్డాయి. అనంతరం న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో ఏజిపి పుల్యాల నాగ శేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ సెక్రటరీ శరభయ్య, న్యాయ వాదులు వెంకటరమణ,వెంకట రాముడు, యుగంధర్ రావు, సి విజయ్ కుమార్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసులను విచారిస్తున్న జడ్జి

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని సంజీవ్ నగర్, హనుమాన్ నగర్ కాలనీవాసుల, పాదాచారుల సౌకర్యం 2 రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించడానికి బేతంచెర్ల మండలం ఎంపీపీ, బుగ్గన నాగభూషణం రెడ్డి, తాసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి కలిసి రైల్వే అధికారులతో కలిసి శనివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు, ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, తాసిల్దార్ మాట్లాడుతూ గతంలో రైల్వే డబుల్ ట్రాక్ లేకుండా సింగల్ లైన్ ఉన్నందువలన పాదాచారులు రైల్వే ట్రాక్ దాటుకొని హనుమాన్ నగర్, సంజీవ్ నగర్ కాలనీలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం రైల్వే డబ్బులు లైన్ ట్రాక్ ఏర్పాటు చేయడం వలన రైలు, గూడ్స్ దాదాపు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ ఉన్నందువలన ప్రజలు రైల్వే ట్రాక్ దాటేటప్పుడు ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉన్నందువలన రైల్వే ట్రాక్ దాటకుండా అడ్డుకంచే వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రజలకు కాలనీవాసులకు ఇబ్బందిగా ఉన్నందున ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డితో ఆయా కాలనీలా వాసులు విన్నవించుకోగా మంత్రి రైల్వే ఉన్నత అధికారులతో చర్చించి రెండు రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయడానికి అనుమతి కోరడం వలన సానుకూలంగా స్పందించిన అధికారులు సాధ్యమైనంత త్వరలో రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టడానికి అనుమతి ఇస్తున్నట్లు వారు తెలియజేశారు. సాధ్యమైనంత త్వరగా హనుమాన్ నగర్, సంజీవ్ నగర్ కాలనీవాసుల పాదాచారుల కొరకు రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించడానికి సానుకూలంగా రైల్వే అధికారులు స్పందించినందుకు స్థల పరిశీలన చేసినందుకు ఆయా కాలనీల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

స్థల పరిశీలన చేస్తున్న ఎంపీపీ, తాసిల్దార్

బలిజ, కాపులు ఐక్యమత్యంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

బలిజ, కాపు కులస్తులు ఐకమత్యంతో ముందుకెళ్లాలని యారో కన్స్ట్రక్షన్ సంస్థ అధినేత, కాపు బలిజ అన్న సత్రం అధ్యక్షులు శెట్టి విజయ్ కుమార్ అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో కాపు బలిజ సంఘం ఐక్యమత్యంతో కార్తీక వనభోజన కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయ బలిజకాపు, తెలగ నిత్య అన్నదాన సత్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రం అధ్యక్షులు శెట్టి విజయకుమార్ మాట్లాడుతూ కళ్యాణ మండప నిర్మానాన్ని రూ.40 లక్షలతో ఎకరా స్థలంలో చేపడతామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ బలిజ, కాపు కులస్తుల అభివృద్ధికి సహకారం అందించే పార్టీలకే మద్దతునిస్తామని తెలిపారు. పెద్ద సంఖ్యలో బలిజ, కాపు సంఘీయులు పాల్గొనడంతో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం సత్రం 2024 క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజరాయుడు, హైకోర్టు న్యాయవాది బోల బాలాజీ, రాయల్ కాప్స్ చైర్మన్ దేవి నాయుడు, రాము, ఎంపీపీ వీరభద్రుడు, కర్నూలు కోనేటి చంద్రబాబు నాయుడు, కోనేటి వెంకటేశ్వర్లు, చింతల రామకృష్ణ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శెట్టి విజయ్ కుమార్

ఇరిగెల ఆధ్వర్యంలో జనసేనలో చేరిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రుద్రవరం మండల కేంద్రానికి చెందిన 70 కుటుంబాల వారు స్వచ్ఛందంగా శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చేరిన వారికి జనసేన తాలూకా నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇరిగెల మాట్లాడుతూ నాగ లింగమయ్య, గౌడ్, చంటి, బన్నీ, హుస్సేన్ భాష, సురేష్, నరసింహ, జాకీర్, నరేష్, హుసేని, బాలస్వామి, ఓబయ్య, నవీన్, మహమ్మద్, రాజు, సూరి, విజయ్, చైతన్య, వెంకటసుబ్బయ్య, జనార్ధన్ తదితరులు జనసేన పార్టీ పట్ల ఆకర్షితులై పార్టీలో చేరారని చెప్పారు. తమను నమ్మి పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తాలూకా అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, ఇరిగెల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన నేతలు

వ్యవసాయ కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

- జనసేన పార్టీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి - రుద్రవరం



సిరివెళ్ల మండల కేంద్రంలోని నాయి బ్రాహ్మణ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ మంగలి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి దాదిరెడ్డి మధుసూదన్ డిమాండ్ చేశారు. శనివారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర్లు వ్యవసాయ పనులలో భాగంగా పురుగు మందు పిచికారి చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి మృతి చెందడం బాధాకరమన్నారు. కుటుంబానికి ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ నుండి మొత్తం రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేసియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా నిలిచి పోరాడుతామని తెలిపారు. కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా - వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని చింతలచెరువు గ్రామంలో పొలం పనుల నిమిత్తం ట్రాక్టరులో వెలుతున్న లక్ష్మీనారాయణ రెడ్డి (47) ప్రమాదవశాత్తు ట్రాక్టరు బోల్తాపడ్డంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి శనివారం తెల్లవారుజామున ట్రాక్టరు తీసుకుని పొలం దున్నేందుకు బయల్దేరారు. పొలాల రస్తాలో ధాన్యం ఆరవేయడంతో పక్కకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ట్రాక్టరు ప్రమా దవశాత్తు బోల్తాపడింది. దీంతో ట్రాక్టరులోని లక్ష్మీనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పిస్తున్న భూమా జగత్ విక్యాత్ రెడ్డి

లక్ష్మీనారాయణరెడ్డి మృతికి భూమా విఖ్యాత్ రెడ్డి నివాళ్లు

చింతలచెరువు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆళ్లగడ్డ నియోజకవర్గ టిడిపి నాయకులు భూమా విఖ్యాత్ రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు. లక్ష్మీనారాయణరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని తెలిపారు.

శ్రీనంది కళాశాలలో ఘనంగా వీడ్కోలు డే

ప్రజాశక్తి- నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ నందు శనివారం శ్రీనంది జూనియర్ కళాశాల ఫేర్వెల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృ తిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ బద్దుల శ్రీకాంత్‌ను జ్ఞాపికతో అధ్యాపక బృందం సన్మానించింది. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కళాశాల చైర్మన్ సూదిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, కరెస్పాండెంట్ పుల్యాల రామచంద్రారెడ్డి, రమేష్ రెడ్డి, పెరుమాళ్ళ శ్రీనాథ్, శ్లోక స్కూల్ డైరెక్టర్స్ కవితా రెడ్డి, శ్రీదేవి రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్ ను సన్మానిస్తున్న దృశ్యం

అన్నప్రసాద వితరణకు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక మాసం సందర్భంగా శనివారం నాడు శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం రూ.2 లక్షలు పుటపర్తికి చెందిన కె. యల్లమ్మ, విశ్రాంత ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, కలిసి విరాళం మొత్తాన్ని ఆలయ ప్రాంగణ ములో కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజుకు అందజే శారు. కీర్తిశేషులు వి. లక్ష్మయ్య పేరున అన్నదానం జరిపేందుకు విరాళం మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామిఅమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదాలను అందజేయడం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ సమర్పణ కార్యక్రమములో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎన్.వి. మోహన్ ఉన్నారు.

కోరుమానుపల్లెలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

కొలిమిగుండ్ల మండలంలోని కోరుమానుపల్లె శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక కడ శనివారం కావడంతో వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శ్రీ అభయ ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి నాయకులు వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, పేరం సత్యనారా యణరెడ్డి, నాయకులు పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు.

IN THE COURT OF SENIOR CIVIL JUDGE DHONE
E.P. No. 21/2023 in O.S. No. 476/2014
A. Suresh ...D.Hr
Vs
Boggarapu Sreenivasulu
S/o. B. Mahanandaiah, H.No. 8-1-169-21,
Opp. Sriram Talkies, Dhone-518222. ...J.Dr
Notice to J.Dr U/o 21 Rule - 22
పై అమలు దావా నందు **D.Hr** నీ నుండి తనకు రావలసిన బాకీ రాబట్టుకొనుటకు అమలు దావా నీ మీదా వేసియున్నారు. సదరు అమలు దావా నందు నోటీస్ తీసుకోనందున నీవు పై అడ్రస్సులో లేనందు వలన నీకు సదరు నోటీస్ పత్రిక ద్వారా ఇవ్వవలసినదిగా కోర్టు వారు ఆర్డరు చేసియున్నారు. సదరు అమలు దావాలో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 20-12-2023వ తారీఖున నీవు కాని నీ వకీలు ద్వారా కాని పై కోర్టు నందు తెలుపుకొనవలయును. అట్లు లేని ఎడల నీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది : 20-12-2023
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఇట్లు
ALA. Sreedhar,
B.Sc., LLB,
Advocate, Dhone-518222,
Nandyal Dist.
Cell : 9396300365

IN THE COURT OF SENIOR CIVIL JUDGE DHONE
E.P. No. 20/2023 in O.S. No. 475/2014
A. Satyanarayana Since died
Rep. by his Legal heirs
A. Lakshmidevamma & 3 other ...D.Hrs
Vs
Boggarapu Sreenivasulu
S/o. B. Mahanandaiah, H.No. 8-1-169-21,
Opp. Sriram Talkies, Dhone-518222. ...J.Dr
Notice to J.Dr U/o 21 Rule - 22
పై అమలు దావా నందు **D.Hr** నీ నుండి తనకు రావలసిన బాకీ రాబట్టుకొనుటకు అమలు దావా నీ మీదా వేసియున్నారు. సదరు అమలు దావా నందు నోటీస్ తీసుకోనందున నీవు పై అడ్రస్సులో లేనందు వలన నీకు సదరు నోటీస్ పత్రిక ద్వారా ఇవ్వవలసినదిగా కోర్టు వారు ఆర్డరు చేసియున్నారు. సదరు అమలు దావాలో నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న ఎడల 20-12-2023వ తారీఖున నీవు కాని నీ వకీలు ద్వారా కాని పై కోర్టు నందు తెలుపుకొనవలయును. అట్లు లేని ఎడల నీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది : 20-12-2023
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఇట్లు
ALA. Sreedhar,
B.Sc., LLB,
Advocate, Dhone-518222,
Nandyal Dist.
Cell : 9396300365

IN THE COURT OF SENIOR CIVIL JUDGE DHONE
E.P. No. 22/2023 in O.S. No. 480/2014
M. Venkateswarlu ...D.Hr
Vs
Boggarapu Sreenivasulu
S/o. B. Mahanandaiah, H.No. 8-1-169-21,
Opp. Sriram Talkies, Dhone-518222. ...J.Dr
Notice to J.Dr U/o 21 Rule - 22
పై అమలు దావా నందు **D.Hr** నీ నుండి తనకు రావలసిన బాకీ రాబట్టుకొనుటకు అమలు దావా నీ మీదా వేసియున్నారు. సదరు అమలు దావా నందు నోటీస్ తీసుకోనందున నీవు పై అడ్రస్సులో లేనందు వలన నీకు సదరు నోటీస్ పత్రిక ద్వారా ఇవ్వవలసినదిగా కోర్టు వారు ఆర్డరు చేసియున్నారు. సదరు అమలు దావాలో నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న ఎడల 20-12-2023వ తారీఖున నీవు కాని నీ వకీలు ద్వారా కాని పై కోర్టు నందు తెలుపుకొనవలయును. అట్లు లేని ఎడల నీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది : 20-12-2023
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఇట్లు
ALA. Sreedhar,
B.Sc., LLB,
Advocate, Dhone-518222,
Nandyal Dist.
Cell : 9396300365

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, DHONE.
Insolvency Petition No.34/2023
PATAN HUSSAIN SAHEB, Age: 54 years, S/o.Patan Chinna Maktum Saheb, Muslim, Agricultural Coolie, R/o.H.No.8-28, Peddamalkapuram village, Dhone mandal, Nandyal Dist. Cell: 88850 14833.
...PETITIONER / DEBTOR
- Vs. -
RESPONDENTS/CREDITORS
1. B. MADDAIAH, Age: 63 years, S/o.B. Chinthakayala Chinna Lingaiah, Hindu, Business, R/o.H.No.2/40, R. Kothapalli (V), Bethamcherla (M), Nandyal Dist. Cell: 8885014833.
2. CHINNA POTHULA VENUGOPAL, Age: 55 years, S/o. Pedda Somanna, Hindu, Business, R/o. H.No.1/39, Chinnamalkapuram (V), Dhone (M), Nandyal Dist. Cell: 62814 63309.
3. SHAIK SHAKEER BASHA, Age: 35 years, S/o. Nadipi Mahaboob Saheb, Muslimm, Business, R/o.H.No.3/140, Jaladurgam (V) Peapully (M), Nandyal Dist. Cell: 94947 33273.
4. RAMIJA BEE, Age: 66 years, W/o.Nadipi Mahaboob Saheb, Muslim, Business, R/o.H.No.3/140, Jaladurgam (V), Peapully (M), Nandyal Dist. Cell: 94947 33273.
5.S.CHINNA KHADAR VALI, Age: 58 years, S/o.S. Chinna Khadar Saheb, Muslim, Business, R/o.H.No.1/51, Jaladurgam (V), Peapully (M), Nandyal Dist. Cell: 99492 55658.
6. EERLA PEDDA JAMBULAIAH, Age: 64 years, S/o. Eerla Chinna Salanna, Hindu, Business, R/o.H.No.4/75, Venkatanayunipalle (V), Dhone (M), Nandyal Dist. Cell: 81848 78403.
7. CHATAKONDA SURESH SETTY, Age: 60 years, S/o.Chatakonda Seshaphani Setty, Hindu, Business, R/o.H.No.2/62, Near Ammavarishala, Pathapeta, Dhone (T) & (M), Nandyal Dist. Cell: 94401 40455.
8. RAJA SANTOSH, Age: 50 years, S/o.Raja Venkataramaiah, Hindu, Business, R/o.H.No.2/12, Chinna Malkapuram (V), Dhone (M), Nandyal Dist. Cell: 94902 10295.
9. GANDLA JAGADEESH, Age: 35 years, S/o.G. Prasad Hindu, Business, R/o.H.No.1/79, Pedda Malkapuram (V), Dhone (M), Nandyal Dist. Cell: 80746 48547.
10. T. RAMA GOPAL, Age: 55 years, S/o.T. Ramudu, Hindu, Cultivation, R/o.H.No.8-88, Pedda Malkapuram (V), Dhone (M), Nandyal Dist. Cell:94929 46354.
11. M.OBULAMMA, Age: 65 years, W/o.Late M. Subbareddy, Hindu, Finance Business, R/o. 4-149-32-11-8-11, Opp: M.D.O. Office, Dhone (Town) & (Mandal), Nandyal Dist. Cell:94928 35603.
12. T. JAYARAMUDU, Age: 60 years sir S/o.T. Ramudu, Hindu, Finance Business, Dhone (M)/5andeddaista Cell: 9440153285.
13.A.VIJAYUDU, Age: 45 years, S/o. Maddilety, Hindu, Finance Business, No. Pedda Malkaputa, (V), Dhone (M), Nandyal Dist. Cell:
14. R. VENKATARAMUDU, Age:50 years, S/o.Venkatanna, Hindu, Lineman, R/o.H.No.4-102, Bingododdi (V), Veldurthy (M), Kurnool Dist. Cell:94912 00527.
నంద్యాల జిల్లా, డోన్ మండలం పెద్దమల్కాపురం, చిన్నమల్కాపురం గ్రామ ప్రజలకు మరియు ప్యాపిలి మండల, గ్రామ ప్రజలకు మరియు బేతంచెర్ల మండల, గ్రామ ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు ఐపి లో అర్జిదారు PATAN HUSSAIN SAHEB, S/o. Patan Chinna Maktum Saheb, R/o పెద్దమల్కాపురం గ్రామం, డోన్ మండలం, నంద్యాల జిల్లా మనవడి వైద్య ఖర్చులకు గాను వచ్చిన నష్టము వలన తనను దివాలా దారినిగా తీర్మానం చేయమని కోరుతూ పైకోర్టులో అర్జీలు దాఖలు (ఐ.పి.పిటీషన్) చేసినారు ఇందుపైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 12-01-2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
వాయిదా తేదీ : 12-01- 2024
A.SREEDHAR, BSc, LLB
V.Ravi Prakash, B.A, LLB
వాదిపరం న్యాయవాదులు
Dhone-518222, Nandyal (Dt), A.P.
Mobile : 9396300365